క్లుప్తంగా

రాగి ఆకుపై 'కళాతపస్వి'



పొదలకూరు: కళాతపస్వి, సినీ దర్శకుడు కె.విశ్వనాథ్ చిత్రాన్ని మండలంలోని మహమ్మదాపురానికి చెందిన విశ్రాంత డ్రాయింగ్ టీచర్ పచ్చా పెంచలయ్య శుక్రవారం రాగి ఆకుపై చిత్రించి తన అభిమానాన్ని చాటుకున్నారు. విశ్వనాథ్ మృతి నేపథ్యంలో ఆయన స్మృతిలో రాగిఆకుపై చిత్రాన్ని గీసి నివాళులర్పించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

మనుబోలు: మండలంలోని బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని గురు, శుక్రవారాల్లో వైభవంగా నిర్వహించారు. గురువారం రాత్రి అంకురార్పణ కార్యక్రమం చేపట్టారు. వేదపండితుడు వెంకటసాయిపవన్ ఆధ్వర్యంలో అర్చకుడు హనుమాచార్యులు తదితరులు తొలుత విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, అభిషేకం, హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు పొన్నూరు రామకృష్ణయ్య దంపతులు, ఇప్పగుంట సత్యనారాయణమూర్తి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించండి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కౌన్సిలర్

బుచ్చిరెడ్డిపాళెం: పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని బుచ్చిరెడ్డిపాళెం 16 వార్డు కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ కోరారు. ఈ మేరకు శుక్రవారం బుచ్చిరెడ్డిపాళెంలోని 16వ వార్డులో శ్యాంప్రసాద్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటాద్రి, మల్లికార్జున, కృష్ణయ్య పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి..

వెంకటాచలం: బైక్ అదుపుతప్పి పడిపోయి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. నెల్లూరు నగరానికి చెందిన వెంకటేష్ బైక్‌పై కృష్ణపట్నం వైపు వెళుతుండగా సర్వేపల్లి సమీపంలో బైక్ అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో వెంకటేష్‌కు గాయాలు కాగా వాహనదారులు గమనించి అతనిని చికిత్సనిమిత్తం 108 వాహనంలో జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీమా నగదు అందజేత

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం సచివాలయం-1 పరిధిలో నివాసం ఉంటున్న చల్లా పెంచలమ్మ అనారోగ్యంతో మృతిచెందిన నేపథ్యంలో ఆమె అంత్యక్రియల నిమిత్తం వైఎస్సార్ బీమా నుంచి తక్షణ సాయంగా రూ.10 వేలు మృతురాలు కోడలు పూజితకు శుక్రవారం అందజేశారు. ఈ నగదును సర్పంచ్ బి.సుప్రియ, పంచాయతీ కార్యదర్శి జి.జాలయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ డి.వెంకయ్య, వలంటీర్ ఆర్వీ సతీష్ బాధిత కుటుంబానికి అందజేశారు.

ఫోర్టిఫైడ్ బియ్యంలో పోషక విలువలు

కొడవలూరు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి వినియోగిస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యంలో పోషక విలువలు సమృద్ధిగా ఉన్నాయని, ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజనం పాఠశాలలోనే చేయాలని ఎంఈఓ జి.వసంతకుమారి విద్యార్థులకు సూచించారు. మండలంలోని చంద్రశేఖరపురం ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం ఆమె సందర్శించి తరగతుల వారీగా విద్యార్థుల అభ్యసనస్థాయిని పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలోని ఫోర్టిఫైడ్ బియ్యంలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, బి-కాంప్లెక్స్-12 తదితర బలవర్ధక పోషకాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం పాఠశాలలో పరిశుభ్రతను చూసి హెచ్‌ఎంను అభినందించారు. ఆమె వెంట హెచ్‌ఎం డేగా మురళీమోహన్‌రావు, ఉపాధ్యాయులు ఎం.శివకుమార్, ఎం.భవాని, పెంచలయ్య ఉన్నారు.

ఎదుగుదలను గమనించాలి

పొదలకూరు: బాలికల ఎదుగుదలను తల్లిదండ్రులు గమనిస్తూ వారి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని నెల్లూరు ధాత్రి ఆస్పత్రి మెటర్నిటీ వైద్యనిపుణురాలు డాక్టర్ వేదవల్లి వాణిశ్రీ సూచించారు. బాలికలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలపై ఇందూరు ప్రభాకర్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని మహ్మదాపురం డీఎస్సార్ జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన డాక్టర్ వేదవల్లి వాణిశ్రీ మాట్లాడుతూ బాలికల ఎదుగుదల సమయంలో ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే వైద్యుల సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించారు. సదస్సులో చెస్ట్ కేర్ వైద్యనిపుణుడు డాక్టర్ పి.దిలీప్‌కుమార్‌యాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ రామకృష్ణ, ట్రస్ట్ అధ్యక్షుడు శీనయ్య, ఉపాధ్యాయులు శ్రీహరి, నాగజ్యోతి, విజయ్, విద్యార్థినుల తల్లులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు



తోటపల్లిగూడూరు: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్‌ఈబీ అధికారులు, ఉపాధ్యాయులు

తోటపల్లిగూడూరు: యువత మాదక ద్రవ్యాలకు బానిలై చెడు మార్గంలో పడకుండా జాగ్రత్త పడాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బాలకృష్ణ సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం, పోక్సో చట్టం, గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ అనే అంశాలపై శుక్రవారం మండలంలోని చిన్నచెరుకూరు, తోటపల్లిగూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈబీ సీఐ బాలకృష్ణ మాట్లాడుతూ యువత చెడు మార్గాల్లో పయనించి తమ ప్రాణాల మీదకు తెచ్చుకొంటున్నారన్నారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాలను వినియోగించి వారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై యువత అవగాహన కలిగి ఉండాలన్నారు. కృష్ణపట్నం పోర్ట్ సీఐ వేమారెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివి సంస్కారవంతులుగా ఎదిగి తల్లిదండ్రుల కీర్తి ప్రతిష్టలను కాపాడాలన్నాలని సూచించారు. అనంతరం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్‌ఈబీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనర్థాలు

కొడవలూరు: యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారడం వల్ల ఎన్నో అనర్థాలు చోటుచేసుకొంటున్నాయని ఎస్‌ఈబీ సీఐ ఆర్.నరహరి పేర్కొన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై మండలంలోని తలమంచి మిక్స్‌డ్ కాలనీలో గ్రామస్తులు, విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, గుట్కా, ఖైనీలకు బానిసలుగా మారితే ప్రాణాంతకమవుతుందన్నారు. గతంలో గంజాయికి బానిసగా మారిన గ్రామస్తుడొకరు మృత్యువాత పడ్డాడని గుర్తుచేశారు. గంజాయి, నాటుసారా ఎక్కడైనా విక్రయిస్తుంటే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 14500 లేదా ఎస్‌ఈబీ ఎస్సై 9440902524 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ ఎస్సై టి.శ్రీనివాస్, కానిస్టేబుల్స్ వి.పాల్, తులసి తదితరులు పాల్గొన్నారు.

30 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

- ట్రక్ ఆటోతో సహా బియ్యం సీజ్



పట్టుబడిన ట్రక్ ఆటోతో డీటీ, ఆటో డ్రైవర్

కొడవలూరు : అక్రమంగా తరలిస్తున్న 30 బస్తాల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల డీటీ కృష్ణప్రసాద్ పట్టుకున్నారు. ఈ ఘటన మండలంలోని చంద్రశేఖరపురంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. చంద్రశేఖరపురంలోని ఏపీఎస్ డబ్ల్యూసీ గోదాము నుంచి 30 బస్తాల రేషన్ బియ్యం ట్రక్ ఆటోలో అక్రమంగా తరలిస్తూ హైవే మీదకు రాగానే డీటీ కృష్ణ ప్రసాద్ గుర్తించారు. వెంటనే ఆటోతో సహా బియ్యాన్ని సీజ్ చేశారు. ట్రక్ ఆటో యజమాని శింగంశెట్టి హరీష్, డ్రైవర్ పి.మధుసూదన్‌రావులపై 6-ఏ కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన ఆటోను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి బియ్యాన్ని కోవూరులోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించారు. సీజ్ చేసిన ట్రక్ ఆటోతో సహా బియ్యం విలువ రూ.2,55,550 ఉంటుందని డీటీ తెలిపారు. పేదలకు ఇవ్వాల్సిన బియ్యం బహిరంగ మార్కెట్‌కు తరలించి లాభపడడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

శేషవాహనం బహూకరణ



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారికి శుక్రవారం దాతలు నూతన శేషవాహనాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడుతూ నెల్లూరుకు చెందిన మునగా హనుమంతరావు జ్ఞాపకార్థం ఆయన భార్య వరలక్ష్మి, కుమారులు అనిల్‌కుమార్ - అలేఖ్య, ప్రవీణ్‌కుమార్ - హర్షిత దంపతులు స్వామి, అమ్మవార్లకు ఉత్సవ నిర్వహణ కోసం శేషవాహనాన్ని బహూకరించారని తెలిపారు. అర్చకులు ఈ సందర్భంగా వాహనానికి సంప్రోక్షణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ వెంకటసుబ్బయ్య, పాలకమండలి సభ్యులు నందకుమార్, శివకుమార్, రఘురామయ్య, కామేశ్వరి, సుప్రజ, పద్మ, విమల, విజయమ్మ, శశిశేఖర్‌శర్మ పాల్గొన్నారు.

ఫ్యాన్ వితరణ

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక భవిత కేంద్రానికి దాతలు శుక్రవారం ఫ్యాన్ వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ దిలీప్ మాట్లాడుతూ జొన్నవాడ గ్రామానికి చెందిన కందికట్టు సునీల్ కుమారుడు యగ్నేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని భవిత కేంద్రానికి ఫ్యాన్ అందించినట్లు తెలిపారు. భవిత కేంద్రం ఉపాధ్యాయులు శేషమ్మ, శ్రీనివాసులురెడ్డి, రిసోర్స్‌పర్సన్ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతి కూలీకి రూ.257 గిట్టుబాటు కావాలి

- డ్వామా పీడీ వెంకట్రావ్



సప్లై చానల్ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకట్రావ్

పొదలకూరు: ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు వచ్చే ప్రతి కూలీకి సగటున రూ.257 కూలి గిట్టుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ వెంకట్రావ్ సూచించారు. పొదలకూరు పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పొదలకూరు చెరువు సప్లై చానల్ పనులు చేస్తున్న కూలీలతో పీడీ మాట్లాడారు. టీఏలు, ఎఫ్‌ఏలు కూలీలకు రూ.257 కూలి వచ్చేలా పనులను చేయించాలని ఆదేశించారు. కూలీల సంఖ్యను పెంపొందించుకోవాలని, పొదలకూరు పంచాయతీ చిట్టేపల్లి గ్రామంలో కూలీలు ఉన్నారని, వారిని పనులకు పురమాయించాలని సూచించారు. ప్రస్తుతం పనులకు హాజరవుతున్న కూలీలకు రూ.235 గిట్టుబాటు అవుతున్నట్లు తెలిపారు.

దేగపూడిలో ఏపీడీ తనిఖీ

మండలంలోని దేగపూడి గ్రామంలో డ్వామా ఏపీడీ శ్రీహరిరెడ్డి ఉపాధి హామీ పనులను శుక్రవారం తనిఖీ చేశారు. గ్రామంలో కాలువ పూడిక తొలగింపు పనులను కూలీలు చేస్తుండగా పరిశీలించి కూలీల సంఖ్యను పెంచాలని సిబ్బందికి సూచించారు. ఇక్కడ సగటున రూ.210 మాత్రమే కూలీలకు గిట్టుబాటు అవుతున్నట్లు తెలిపారు.

క్రమశిక్షణతో చదివితే విజయం మనదే

- ఫాల్సమ్ సిటీ వైస్ మేయర్ ఏడుకొండలు



ఏడుకొండలుకు ఆహ్వానం పలుకుతున్న గురుకులం ప్రిన్సిపల్ తదితరులు

కొడవలూరు: క్రమశిక్షణతో కష్టపడి చదివితే విజయం మన సొంతమవుతుందని అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం ఫాల్సమ్ సిటీ వైస్ మేయర్ చలంచర్ల ఏడుకొండలు అన్నారు. మండలంలోని చంద్రశేఖరపురం గిరిజన గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడవలూరు మండలం మన్మథరావుపేట గ్రామానికి చెందిన తాను నిరుపేద కుటుంబంలో జన్మించానని, చదువుకొంటూ పనులకు వెళ్లేవాడినని, కూలి పనికి వెళ్లి మొదటగా సంపాదించిన రూపాయి నోటును విద్యార్థులకు చూపించారు. తొలిసారిగా సంపాదించిన రూపాయి నోటును ఇప్పటికీ ఎంతో జాగ్రత్తగా భద్రపరచుకొన్నానని తెలిపారు. ఉన్నతస్థాయికి రావాలన్న తపనతో చదవాలని విద్యార్థులకు సూచించారు. గురుకులం ప్రిన్సిపల్ టి.విష్ణుప్రియ మాట్లాడుతూ ఉన్నతస్థాయిలో ఉన్న ఏడుకొండలు తమ విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశమిచ్చేందుకు పాఠశాలకు రావడం అభినందనీయమన్నారు. విద్యార్థులంతా చదువుకొని ఉన్నతస్థానాలకు చేరుకోవాలన్న ఆకాంక్షతో ఏడుకొండలు గతంలో గురుకులానికి సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటుకు విరాళం ఇచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ చౌటూరు శీనయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై ఆసక్తి పెంచుకోవాలి



చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

తోటపల్లిగూడూరు: చిరుధాన్యాల సాగుపై రైతులు ఆసక్తి పెంచుకోవాలని ఆత్మ డీపీడీ శివనారాయణ సూచించారు. చిరుధాన్యాల సాగుపై శుక్రవారం తోటపల్లిగూడూరు సొసైటీ కార్యాలయంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరితోపాటు చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు, సామలు, వరిగలు, ఈదలు, అరికలు వంటి పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. చిరుధాన్యాల సాగుపై రైతులకు ఆర్బీకేల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. శాస్త్రీయమైన పద్ధతులు పాటిస్తే చిరుధాన్యాల సాగు సులభతరమేనన్నారు. వరితో పోల్చుకొంటే చిరుధాన్యాలకు ఆశించే క్రిమికీటకాలు, చీడపీడలు తక్కువని తెలిపారు. కార్యక్రమంలో ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్, ఏఓ రాధ, శాస్త్రవేత్త సురేఖ, ఎస్‌ఎంఎస్‌కే కిరణ్‌కుమార్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి గీతాకుమారి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో గంగా కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామి

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో శుక్రవారం గంగా కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. తొలుత అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి వివిధ పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. అర్చకుల వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి సంబంధించి ఆదివారం ఉదయం 9 గంటలకు శంకుస్థాపన చేయనున్న క్రమంలో దానికి సంబంధించి కరపత్రాలను నిర్వాహకులు శుక్రవారం దేవస్థానంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్మాణ కమిటీ కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రూ.15 లక్షల వ్యయంతో ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు.

ఆంజనేయస్వామి విగ్రహ ఉద్వాసన పూజలు

శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం కోసం శుక్రవారం విగ్రహ ఉద్వాసన హోమం నిర్వహించారు. ఆలయంలో స్వామి, అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆంజనేయస్వామి విగ్రహాన్ని దేవస్థానం ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. కాగా ఆంజనేయస్వామి ఆలయం నిర్మించేందుకు విగ్రహాన్ని ఉద్వాసన చేసి దేవస్థానంలో భద్రపరచి తిరిగి ప్రతిష్ఠించేందుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ నిర్మాణ కమిటీ బాధ్యులు వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎం.శ్యామ్‌ప్రసాద్, దాసరి శ్రీనివాసులు, చొప్పా వెంకటేశ్వర్లు, సన్నికంటి మురళి, కొమ్మి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గొలగమూడి విద్యార్థినులు



సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

వెంకటాచలం: ఏలూరు జిల్లా పెదవేగి ఏపీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్‌లో శనివారం నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-14 స్కూల్‌గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని గొలగమూడి ప్రభుత్వ ఆశ్రమ గిరిజన పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు బి.కామేశ్వరి శుక్రవారం తెలిపారు. మూడు రోజులపాటు జరగనున్న ఈ పోటీల్లో 8వ తరగతి విద్యార్థినులు బి.విఖిత, జి.ఇలాక్షి పాల్గొంటారని తెలిపారు.

మత్స్యకార నాయకుడికి సన్మానం



ఆవుల వాసును సన్మానిస్తున్న మత్స్యకారులు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): కోవూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగ సభ్యుడిగా ఎన్నికైన మత్స్యకార నాయకుడు ఆవుల వాసును మండలంలోని లక్ష్మీపురంలో స్థానిక మత్స్యకారులు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆవుల వాసు మాట్లాడుతూ తనపై నమ్మకంతో యువజన విభాగం సభ్యుడిగా ఎన్నిక చేసిన కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

యల్లాయపాళెంలో ఉచిత వైద్యశిబిరం

కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో నెల్లూరుకు చెందిన ఎనెల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతోపాటు గ్రామంలోని పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించారు. పలువురికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆస్పత్రి డాక్టర్ జె.అభినయ రోగులను పరీక్షించారు. అనంతరం ఆమె విద్యార్థులకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్‌కే గౌస్‌బాషా, ఉపాధ్యాయులు ఎల్‌సీఎల్ నారాయణరావు, వై.శ్రీలత, సీఆర్‌పీ ఎం.దయాకర్, హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ ఎం.మధు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులంతా ఈ-క్రాప్ నమోదు చేసుకోండి



మడమనూరులో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

మనుబోలు: రైతులంతా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు సూచించారు. మండలంలోని మడమనూరు, వీరంపల్లి, పిడూరు గ్రామాల పరిధిలోని పొలాలను శుక్రవారం వ్యవసాయాధికారులు పరిశీలించి ఈ-క్రాప్‌పై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే నీటి వినియోగం, ఎరువుల యాజమాన్యంపై రైతులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తాను సాగు చేస్తున్న పంటలకు సంబంధించి వీఏఏ వద్ద ఈ-క్రాప్ నమోదు చేయించుకుంటేనే ప్రభుత్వ రాయితీలు వస్తాయని తెలిపారు. ఆయన వెంట ఏడీఏ నర్సోజీరావు, ఏఓ జహీర్, పీఏసీఎస్ అధ్యక్షుడు మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, రైతులు రామచంద్రారెడ్డి, జనార్దన్‌రెడ్డి, వీఏఏలు శ్రీదేవి, అమూల్య తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో బీసీలకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న మండల వెంకటశేషయ్య

వెంకటాచలం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలో బీసీలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి మండల వెంకటశేషయ్య తెలిపారు. రెండో వైస్ ఎంపీపీగా పచ్చబట్ల మస్తానయ్య ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం వెంకటాచలంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వెంకటశేషయ్య మాట్లాడుతూ చంద్రబాబు బీసీలకు మాయ మాటలు చెప్పి ఓట్లు వేయించుకుని, ఎలాంటి పదవులు బీసీలకు ఇవ్వకుండా అణగదొక్కారని గుర్తుచేశారు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బీసీల్లో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఇందుకు నిదర్శనం రెండో వైస్ ఎంపీపీగా బీసీ వర్గానికి చెందిన పచ్చబట్ల మస్తానయ్యను ఏకగ్రీవంగా ఎన్నిక చేయడమేనన్నారు. బీసీలకు అండగా నిలుస్తున్న మంత్రి కాకాణికి రుణపడి ఉంటామని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ మందా కవిత, వైస్ ఎంపీపీలు కనుపూరు కోదండరామిరెడ్డి, పచ్చబట్ల మస్తానయ్య, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీగా మస్తానయ్య ఏకగ్రీవ ఎన్నిక



మస్తానయ్యకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారిణి ఉషారాణి

వెంకటాచలం: వెంకటాచలం మండలం రెండో వైస్ ఎంపీపీగా కనుపూరు ఎంపీటీసీ సభ్యుడు పచ్చబట్ల మస్తానయ్య శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండో వైస్ ఎంపీపీగా ఉన్న మందల మస్తానమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో శుక్రవారం ఉదయం వెంకటాచలంలోని మండల పరిషత్ కార్యాలయంలో రెండో వైస్ ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. 15 మంది ఎంపీటీసీ సభ్యులు హాజరై, కనుపూరు ఎంపీటీసీ సభ్యుడు పచ్చబట్ల మస్తానయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం మస్తానయ్యకు ఎన్నికల అధికారిణి ఉషారాణి ధ్రువీకరణ పత్రం అందజేశారు.

తోడేరు ఉప సర్పంచ్‌గా శ్రీనివాసులు



పొదలకూరు: మండలంలోని తోడేరు పంచాయతీ ఉప సర్పంచ్‌గా మన్నవరపు శ్రీనివాసులు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉప సర్పంచ్ ఎన్నిక జరగని పంచాయతీల్లో రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులు ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించడంతో గతంలో కోరం లేక నిలిచిపోయిన తోడేరు పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నికను పీఆర్ ఏఈ ప్రసాద్ ఎన్నికల అధికారిగా వ్యవహరించి నిర్వహించారు. పంచాయతీ 2వ వార్డు సభ్యుడు శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ప్రక్రియలో ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి పాల్గొన్నారు. ఉప సర్పంచ్‌గా ఎన్నికైన శ్రీనివాసులును మాజీ సర్పంచ్ ఏనుగు శశిధర్‌రెడ్డి, గ్రామస్తులు అభినందించారు.

గ్రామ పంచాయితీ కార్యాలయం – గురివిందపూడి

టెండరు ప్రకటన — తేది : 03-02-2023

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా, మనుబోలు మండలం, గురివిందపూడి పంచాయతీ నందు తేది. 01-04-2023 నుండి తేది.31-03-2024 వరకు (2023-24వ ఆర్థిక సంవత్సరమునకు) వివిధ సేవలు నిర్వహించుటకు గాను ప్రతిరోజు సిబ్బందిని సమకూర్చుటకు ఆసక్తిగల కాంట్రాక్టర్ల నుండి తేది.14-02-2023 మంగళవారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడును. మరియు అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు హాజరైన టెండరుదారుల సమక్షములో సీల్డు టెండర్లు తెరవబడును. టెండరు దాఖలు చేయువారు క్రింద తెలిపిన విధముగా ధరావత్తు చెల్లించి టెండరు దాఖలు చేయవలెను. నిబంధనలు మరియు వివరములు కార్యాలయ పనివేళలందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	టెండరు వివరములు	ధరావత్తు రూ॥లలో
1.	స్వీపర్లు -2 (ఇద్దరు)	1000-00
2.	పి.డబ్ల్యు.యస్.పంపు ఆపరేటర్లు-2(ఇద్దరు)	
	మొత్తం : 4(నలుగురు)	

సం/- పంచాయతీ సెక్రటరీ, గురివిందపూడి గ్రామపంచాయతీ

గ్రామ పంచాయితీ కార్యాలయం – చెర్లోపల్లి

టెండరు ప్రకటన — తేది : 03-02-2023

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా, మనుబోలు మండలం, చెర్లోపల్లి పంచాయతీ నందు తేది. 01-04-2023 నుండి తేది.31-03-2024 వరకు (2023-24వ ఆర్థిక సంవత్సరమునకు) వివిధ సేవలు నిర్వహించుటకు గాను ప్రతిరోజు సిబ్బందిని సమకూర్చుటకు ఆసక్తిగల కాంట్రాక్టర్ల నుండి తేది.14-02-2023 మంగళవారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడును. మరియు అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు హాజరైన టెండరుదారుల సమక్షములో సీల్డు టెండర్లు తెరవబడును. టెండరు దాఖలు చేయువారు క్రింద తెలిపిన విధముగా ధరావత్తు చెల్లించి టెండరు దాఖలు చేయవలెను. నిబంధనలు మరియు వివరములు కార్యాలయ పనివేళలందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	టెండరు వివరములు	ధరావత్తు రూ॥లలో
1.	స్వీపర్లు -1 (ఒక్కరు)	1000-00
2.	పి.డబ్ల్యు.యస్.పంపు ఆపరేటర్లు-1(ఒక్కరు)	
	మొత్తం : 2(ఇద్దరు)	

సం/- పంచాయతీ సెక్రటరీ, చెర్లోపల్లి గ్రామపంచాయతీ

గ్రామ పంచాయితీ కార్యాలయం – పిడూరు

టెండరు ప్రకటన — తేది : 03-02-2023

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా, మనుబోలు మండలం, పిడూరు పంచాయతీ నందు తేది. 01-04-2023 నుండి తేది.31-03-2024 వరకు (2023-24వ ఆర్థిక సంవత్సరమునకు) వివిధ సేవలు నిర్వహించుటకు గాను ప్రతిరోజు సిబ్బందిని సమకూర్చుటకు ఆసక్తిగల కాంట్రాక్టర్ల నుండి తేది.14-02-2023 మంగళవారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడును. మరియు అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు హాజరైన టెండరుదారుల సమక్షములో సీల్డు టెండర్లు తెరవబడును. టెండరు దాఖలు చేయువారు క్రింద తెలిపిన విధముగా ధరావత్తు చెల్లించి టెండరు దాఖలు చేయవలెను. నిబంధనలు మరియు వివరములు కార్యాలయ పనివేళలందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	టెండరు వివరములు	ధరావత్తు రూ॥లలో
1.	స్వీపర్లు -1 (ఒక్కరు)	1000-00
2.	పి.డబ్ల్యు.యస్.పంపు ఆపరేటర్లు-3(ముగ్గురు)	
	మొత్తం : 4(నలుగురు)	

సం/- పంచాయతీ సెక్రటరీ, పిడూరు గ్రామపంచాయతీ

గ్రామ పంచాయితీ కార్యాలయం – మడమనూరు

టెండరు ప్రకటన — తేది : 03-02-2023

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా, మనుబోలు మండలం, మడమనూరు పంచాయతీ నందు తేది. 01-04-2023 నుండి తేది.31-03-2024 వరకు (2023-24వ ఆర్థిక సంవత్సరమునకు) వివిధ సేవలు నిర్వహించుటకు గాను ప్రతిరోజు సిబ్బందిని సమకూర్చుటకు ఆసక్తిగల కాంట్రాక్టర్ల నుండి తేది.14-02-2023 మంగళవారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడును. మరియు అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు హాజరైన టెండరుదారుల సమక్షములో సీల్డు టెండర్లు తెరవబడును. టెండరు దాఖలు చేయువారు క్రింద తెలిపిన విధముగా ధరావత్తు చెల్లించి టెండరు దాఖలు చేయవలెను. నిబంధనలు మరియు వివరములు కార్యాలయ పనివేళలందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	టెండరు వివరములు	ధరావత్తు రూ॥లలో
1.	పారిశుధ్య కార్మికులు -4 (నలుగురు)	1000-00
2.	పి.డబ్ల్యు.యస్.పంపు ఆపరేటర్లు-3(ముగ్గురు)	
	మొత్తం : 7(ఏడుగురు)	

సం/- పంచాయతీ సెక్రటరీ, మడమనూరు గ్రామపంచాయతీ